జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం,
16-07-2025



# గవర్నర్‌కు చెంతకు రిజర్వేషన్ల ఆర్డినెన్స్

**ఆర్డినెన్స్‌పై గవర్నర్ నిర్ణయం కీలకం కావడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ**

**ఆమోదం పొందిన వెంటనే ప్రభుత్వం జివో జారీకి సన్నాహం**

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :



పంచాయతీరాజ్ చట్టంలోని చిన్న క్లాజ్‌ను సవరించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఇందుకు అనుగుణంగా మంత్రివర్గ సమావేశం నిర్ణయం మేరకు ఆర్డినెన్స్ తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సంతకం చేసిన అనంతరం ఫైల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతకం చేసిన తర్వాత జిఏడి నుంచి ఆర్డినెన్స్ ముసాయిదా రాజ్‌భవన్‌కు మంగళవారం చేరింది. దీంతో గవర్నర్ ఆమోదంతో పంచాయతీ, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలకు వెళ్లేందుకు రిజర్వేషన్లు ఖరారు చేసి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసేందుకు ప్రభుత్వం ముందుకెళుతోంది. 2018 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285 (ఏ)కు సవరణ చేసేందుకు వీలుగా ఆర్డినెన్స్ ముసాయిదాను సిద్ధం చేసి పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యమంత్రి అనుమతితో గవర్నర్‌కు ప్రభుత్వం పంపించింది. ఈ ముసాయిదా ఆమోదం పొందిన వెంటనే 42 శాతం రిజర్వేషన్లను స్థానిక ఎన్నికల్లో అమలు చేసేందుకు వీలు కల్పిస్తూ జీవో జారీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వారం, పది రోజుల్లో ఆర్డినెన్స్‌పై గవర్నర్ ఆమోదం, తర్వాత బీసీ డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా రిజర్వేషన్లను నిర్ణయించడం జరుగుతుందని ప్రభుత్వ వర్గాల సమాచారం. ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

ఇదిలావుంటే ఆర్డినెన్స్‌కు ఎంత వరకు ఆమోదం లభిస్తుందని రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రపతి వద్ద రిజర్వేషన్ బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు గవర్నర్ ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలియజేస్తారా..?లేదా అనే అంశంపై న్యాయకోవిదుల మధ్య ప్రస్తుతం చర్చజరుగుతోంది. ఒక వైపు ఆర్డినెన్స్‌తో గట్టెక్కాలనే ప్రభుత్వ వ్యూహం ఎంత వరకు సఫలీకృతమవుతుందో వేచి చూడాల్సి ఉంది. కాగా ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుతో జివో జారీ చేసిన వెంటనే స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలకు అవకాశం ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అనువుగా తీసుకు రావాలనుకున్న ఆర్డినెన్స్‌లో ముఖ్యంగా రెండు మూడు అంశాలను పొందుపర్చినట్లు సమాచారం. వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలనే కోణంలో స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ముందుకెళుతోందని పేర్కొనట్లు తెలుస్తోంది. ఇప్పటికే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందుకే రాష్ట్ర ఉభయ సభల్లో బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించినట్లు తెలిపిందని సమాచారం. రాష్ట్రపతి వద్ద ఈ బిల్లు పెండింగ్‌లో ఉన్నందున ప్రస్తుత ఉన్న 2018 పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 285 (ఏ)కు సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తీసుకు వస్తున్నట్లు స్పష్టం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మరోవైపు హైకోర్టు సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఆర్డినెన్స్ అనివార్యమైనట్లు పేర్కొన్నట్లు తెలిసింది.

## హెల్మెట్ ధరించండి.. జీవితాన్ని కాపాడుకోండి

**రోడ్డు భద్రత వారోత్సవాల్లో కలెక్టర్ జితేష్ పిలుపు**

టైమ్స్ ఆఫ్ వార్త - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



రోడ్లపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, నిబంధనలు పాటించాలన్న సందేశంతో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రోజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి. ఓ చిన్న జాగ్రత్తతో ప్రాణాన్ని రక్షించుకోవచ్చు," అని సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి బాధ్యతగా ప్రయాణిస్తున్న వారిని అధికారులు ఆపి అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు, ఉచిత బహుమతులు కూడా అందజేశారు. ప్రజల్లో రోడ్డుపై భద్రతపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ అధికారి, మండల అధికారులు, రోజ్ సంస్థ సభ్యులు, సామాజిక కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు స్వయం ఉపాధి రుణాలు

**జూలై 31వ తేదీలోపు దరఖాస్తులు**

టైమ్స్ ఆఫ్ వార్త - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. జీవనోపాధికి తోడుగా దివ్యాంగులకు రుణాలను మంజూరు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా దివ్యాంగుల కోసం పలు రకాల ఉపాధి యూనిట్లకు ప్రభుత్వం రాయితీతో రుణాలు అందిస్తోంది. ఈ కింద 100 శాతం రాయితీతో రూ.50,000 విలువైన 27 యూనిట్లు, 80 శాతం రాయితీతో రూ.1 లక్ష విలువైన ఒక యూనిట్, అలాగే 60 శాతం రాయితీతో రూ.3 లక్షల విలువైన ఒక యూనిట్ మంజూరయ్యాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా జూలై 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారిణి స్వర్ణలత తెలిపారు.

## పరామర్శలతో హృదయాలను గెలుచుకుంటున్న వనమా

**పాత పాల్వంచలో విస్తృత పర్యటన**

టైమ్స్ ఆఫ్ వార్త - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా





బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్ స్వగ్రామమైన పాత పాల్వంచలో సోమవారం విస్తృత పర్యటన నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి పలు కుటుంబాలను పరామర్శించిన ఆయన, ప్రజల మధ్య పలు వేళ్లల్లో సానుభూతి సందేశాలు పంపించారు. ఇటీవలి కాలంలో అనారోగ్యం, ప్రమాదాలు, మరణాల కారణంగా బాధపడుతున్న కుటుంబాలను పరామర్శిస్తూ, ప్రజలతో మమకారంతో మాట్లాడారు. ముఖ్యంగా మాజీ కౌన్సిలర్ గుర్రం నాగయ్య గారిని ఇంటికి వెళ్లి సర్జరీ అనంతర ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. గడియకట్టలో ఇటీవలే మృతి చెందిన గోలి వీరారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబానికి సంతాపం తెలిపారు. అనుముల సైదులు కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. గుండెపోటుతో మరణించిన మద్దోజు మాధవాచారి కుటుంబ సభ్యులను పరామర్శించి తల్లి నారాయణమ్మకు ధైర్యం చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిమ్మల వీరభద్రం ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రామానంద తీర్థ కాలనీలో కాలు సర్జరీ చేసిన గోలి వినోద్ను పరామర్శించారు. KTPS రిటైర్డ్ ఉద్యోగి ఉప్పునూరి భూషయ్య దశదిన కర్మలో పాల్గొని ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనమాతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్వాల సత్యనారాయణ, బత్తుల మధుచంద్, డిష్ నాయుడు, టౌన్ మహిళా అధ్యక్షురాలు బట్టు మంజుల, తంబళ్ల నాగ సత్యం, ధనుగురి రామకృష్ణ, డాక్టర్ మస్తాన్, రమణ, కంచర్ల రామారావు హబీబ్, మైకే తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు జాతీయ గౌరవం

**భద్రాద్రి కలెక్టర్ జితేష్‌కు నేషనల్ జియోస్పేషియల్ అవార్డు**

టైమ్స్ ఆఫ్ వార్త - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. గ్రామీణ సమస్యల పరిష్కారానికి జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (GIS) సాంకేతికతను వినియోగించి, అనేక అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకంగా నిలిచిన విశిష్ట సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయిలో "నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డు" వరించింది. ఈ నెల 17వ తేదీన ముంబైలోని బాంబే వేదికగా జరిగే కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. ఇది భద్రాద్రి జిల్లా వాసులందరికీ గర్వించదగిన విషయం. ఒక జిల్లా స్థాయి అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణాభివృద్ధికి ఉపయోగించి రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో హర్షకరం.బీసీల హక్కుల కోసం బలమైన మద్దతు

## ఇందిరాపార్క్ బీసీ మహాధర్నాలో కొత్తగూడెం బీసీ నేతల హాజరు






హైదరాబాద్: బీసీ ప్రజాప్రతినిధుల ఫోరమ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన బీసీ మహాధర్నాకి కొత్తగూడెం నియోజకవర్గం నుంచి భారీ మద్దతు లభించింది. వందలాదిమంది బీసీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వనమా రాఘవేందర్ నేతృత్వంలో ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల కోసం సాగుతున్న పోరాటానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఈ విధంగా సంఘీభావం తెలియజేయడం గర్వకారణమని అన్నారు. ఈ మహాధర్నాలో జాతీయ బీసీ సంఘం యువజన జిల్లా అధ్యక్షుడు బత్తుల మధుచంద్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, నేతలు ముత్యాల ప్రవీణ్, హుస్సేన్, మధుసూదన్ రావు, జూపెల్లి దుర్గాప్రసాద్, బండ్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ సేవకు ప్రశంసాపత్రం

**ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ**




టైమ్స్ ఆఫ్ వార్త - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన నెలవారీ క్రైమ్ సమీక్ష సమావేశంలో కోర్ట్ ఫంక్షనల్ వర్టికల్ కింద అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్‌కు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐపీఎస్ ప్రశంసా పత్రం అందజేశారు. డిసిఆర్‌బి నుండి భద్రాద్రి జిల్లా కోర్టులో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్, వివిధ కీలక కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రొఫెషనల్ ధోరణితో పనిచేయడం గమనార్హం. కోర్టు వ్యవహారాలలో స్పష్టతతో, సమర్థతతో పని చేస్తూ న్యాయ విభాగంలో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డీఎస్పీ ఎన్. మల్లయ్య స్వామి, ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వారు ఎస్సై ప్రవీణ్‌కు అభినందనలు తెలిపారు.

## రోడ్ భద్రతపై విద్యార్థులకు అవగాహన

టైమ్స్ ఆఫ్ వార్త - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ (ROSE) కార్యక్రమంలో భాగంగా ఈరోజు కె.ఎల్.ఆర్ ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్లపై భద్రతే ప్రథమ కర్తవ్యమని ఈ సందర్భంగా విద్యార్థులకు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాట్లాడిన ఒజా గన్ శ్యామ్, రోడ్డు ప్రమాదాల పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులే రేపటి పౌరులు కావడంతో, రోడ్ భద్రత ప్రమాణాలను తెలుసుకుని ఆచరించాల్సిన బాధ్యత తమపై ఉందని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ వెంకట రమణ రామ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దారా మనోహర్, వెంకట పుల్లయ్య, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం. పురుషోత్తమన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్, ఈటెల రాజేందర్‌లకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. గతంలో ఇద్దరిపై నమోదయిన కేసులను హైకోర్టు కొట్టివేసింది. కెసిఆర్‌పై 2023లో అనుచిత వ్యాఖ్యలు చేశారని బండి సంజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టి వేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్ విచారించిన ధర్మాసనం ఆయనపై నమోదయిన కేసులను కొట్టివేసింది. ఇప్పటికే 2021 నవంబర్ 15వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అనుమతి లేకుండా భారీ వాహనాలతో ర్యాలీ నిర్వహించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉండగా, ఇటీవల హైకోర్టు కొట్టివేసింది. తాజాగా మరోక కేసు కొట్టివేయడంతో ఆయనకు భారీ ఊరట లభించినట్లయింది. కాగా, మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్ కమలాపూర్‌లో నిర్వహించిన ర్యాలీలో అనుమతి లేకుండా బాణాసంచా కాల్చారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ ఈటెల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ఆయనపై నమోదయిన కేసును కొట్టివేసింది.

## జూలై 23న విద్యాసంస్థల బంద్..




హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్ ను హిమాయత్ నగర్ లోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంత, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి అనిల్, జాతీయ నాయకులు మహేష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఎఐడిఎస్ఓ నేత నితీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్ ,కిరణ్ పిడిఎస్‌యు నాయకులు హరీశ్ నవీన్,శ్రీను,ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. ప్రైవేటు,కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ,డిఈఓ పోస్టులను భర్తీ చెయ్యాలని, ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్ షిప్ లను విడుదల చేయాలని, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించి,నిధులు కేటాయించాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చెయ్యాలని, విద్యార్థులకు ఆర్‌టిసిలో ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, ఎన్ఈపి 2020 తెలంగాణలో అమలు చెయ్యకుండా అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలని సమావేశం డిమాండ్ చేసింది.

**PRINTED, PUBLISHED & OWNED BY** MANKALA DASU, H.NO, 3-8-289, Road No. 2 SURYODAYA COLONY , LB NAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor MANKALA DASU, RNI NO. **APTEL/2007/22828** CELL: 9705506999